సాగునీరందేదెప్పుడో ?

- మత్తడి కుడికాలువ పనులు పూర్తి
- ఆరునెలల కింద పూర్తయినా ఇప్పటికి అందని సాగునీరు
- అధికారులు పట్టించుకోవాలని రైతుల వేడుకోలు


మత్తడివాగు ప్రాజెక్టు కుడికాలువ


పూర్తయిన పంప్‌హౌస్

తాంసి: మండలంలోని వడ్డాడి సమీపంలో రైతులకు సాగునీరందించాలనే లక్ష్యంతో 2004లో మత్తడివాగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 2008లో అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ప్రాజెక్టు సమయంలో ఎడమ కాల్వ నిర్మాణం పూర్తికాగా, కుడికాల్వ చేపట్టలేదు. రాష్ట్రం ఏర్పడ్డాక 2017లో ప్రభుత్వం రూ.7.34 కోట్లు మంజూరు చేసింది. అప్పటినీటి పారుదలశాఖ మంత్రి హరీశ్ రావు వీటి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్, సంస్థ చేపట్టిన కుడికాలువ పైప్‌లైన్, పంప్‌హౌస్ పనులు మొదలు పెట్టి గత ఆరునెలల క్రితం పూర్తిచేశారు. ప్రాజెక్టు కుడికాల్వ నిర్మాణానికి భూసేకరణ సమస్య లేకుండా నీటివృథాను అరికట్టేలా మైక్రో ఇరిగేషన్ (పైప్‌లైన్) పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. 1200 ఎకరాలకు సాగునీరందించేందుకు 9 కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్ వేశారు. మొత్తం 25 బ్లాక్‌లుగా విభజించి అవుట్‌లెట్లు ఏర్పాటు చేశారు. దీని ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. రైతులు సరిపడా వినియోగించాక నీటిని వృథా అరికట్టేందుకు భూగర్భ పైప్‌లైన్‌కు ఆటోమెటిక్ వాల్వ్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్ట్ సమీపంలో చేపట్టిన పంప్‌హౌస్‌లో 75 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మూడు విద్యుత్ మోటార్లు, వాటికి అవసరమైన విద్యుత్, నియంత్రిక పనులు సైతం పూర్తిచేశారు.

కుడికాలువ పనులు పూర్తి

2017లో మత్తడివాగు ప్రాజెక్టు కుడికాల్వ పనులు చేపట్టారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నత్తనడకన కొనసాగింది. ఏటా రైతులు పంటలు వేసే సమయంలో పనులు చేపట్టడంతో వారు అడ్డుకున్నారు. దీంతో పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు అధికారుల పర్యవేక్షణలో ఆరునెలల క్రితం పనులు పూర్తయ్యాయి. పంప్‌హౌస్ నుంచి ట్రయల్ రన్ ద్వారా అధికారులు నీటిని విడుదల చేశారు. రబీ సీజన్‌లో ఆయకట్టు సాగునీరందుతుందని రైతులు ఆశపడ్డారు. కొత్త టెక్నాలజీ రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడంలో జాప్యం జరుగుతోంది. రైతులకు సాగునీరందకపోవడంతో పంప్‌హౌస్ అలంకారప్రాయంగా మారనుంది. ఉన్నతాధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

మత్తడివాగు ప్రాజెక్టు కుడి కాల్వ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం మోటార్ల పనితీరు, పైప్‌లైన్ లీకేజీలను పరిశీలించాం. బ్లాక్‌ల ద్వారా నీటిని వినియోగం ఏ విధంగా చేపట్టాలని రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. స్ప్రింకర్ల ద్వారా మాత్రమే నీటి తడులు అందించాలి. మోటార్లపై భారం పడకుండా, పైప్‌లైన్ దెబ్బతినకుండా ఉండేందుకు సూచనలు చేశాం. పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాకే సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటాం.

– హరీశ్‌కుమార్, మత్తడివాగు ప్రాజెక్టు ఏఈ

క్లుప్తంగా

నూతన జాతీయ విద్యావిధానం రద్దుకు ఉద్యమించాలి


సంతకాలు చేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: నూతన జాతీయ విద్యావిధానం రద్దుకు విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గెడం కేశవ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ఆయా కళాశాలల్లో మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయడంతోపాటు నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్‌పోస్టులు భర్తీ చేయడంతో పాటు యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు మెస్రం ప్రవీణ్, గేడం మాణిక్, కార్తీక్, ఆర్తి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం


హుండీ పగులగొట్టి నగదు సేకరిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని రెడ్డికాలనీకి చెందిన ఆరో తరగతి విద్యార్థి లోక త్రినయ్‌రెడ్డి అయ్యప్ప ఆలయానికి విరాళం అందజేశాడు. గతేడాది నుంచి తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బును కొంత ఖర్చుచేసి మిగిలినది త్రినయ్‌రెడ్డి హుండీలో వేసుకున్నాడు. అయ్యప్ప ఆలయ అభివృద్ధి కోసం విరాళాలు వసూళ్లు చేస్తున్నారు. హుండీలో పోగైన రూ.3 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు నిమ్మల సంతోష్‌రెడ్డి, లోక శిరీష్‌రెడ్డి, ఠాకుర్ సాయి, బత్తుల అశోక్, కాటిపెల్లి చంద్రశేఖర్‌రెడ్డిలు ఈ సందర్భంగా త్రినయ్‌రెడ్డిని అభినందించారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన ఉండాలి


విద్యార్థినికి బహుమతి ఇస్తున్న ఎంవీఐ మహేందర్

ఆదిలాబాద్‌రూరల్: రోడ్డు నిబంధనలపై అవగాహన ఉండాలని ఎంవీఐ ఏ.మహేందర్ అన్నారు. రోడ్డుభద్రత వారోత్సవాల్లో భాగంగా మండలంలోని యాపల్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. రోడ్డు భద్రత అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఏఎంవీఐ సాయిచరణ్, పాఠశాల హెచ్ఎం రాములు పాల్గొన్నారు.

‘ఎన్‌సీడీ’ పకడ్బందీగా నిర్వహించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఎన్‌సీడీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మెట్‌పెల్లివార్ శ్రీధర్ అన్నారు. పట్టణంలోని పుత్లీబౌళి, హమాలీవాడ పట్టణ ఆరోగ్య కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఏవిధంగా సేవలు అందిస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

ఒత్తిడికి గురికావొద్దు

ఆదిలాబాద్‌టౌన్: పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. పరీక్షపై చర్చ కార్యక్రమంలో భాగంగా జిల్లాకేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం చిత్రలేఖనంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

తాంసి: భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గిరిగాం ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని 45 మంది గర్భిణులకు వైద్యాధికారి నిఖిల్‌రాజ్ ఆధ్వర్యంలో రక్త, బీపీ, షుగర్ ఇతర రకాల పరీక్షలు చేశారు. హెచ్ఈవో జ్ఞానేశ్వర్, స్టాఫ్‌నర్స్ పూర్ణిమ, ఏఎన్ఎం ఉన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషిచేయాలి


మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ నియంత పోకడలను ఎదుర్కొనే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ నియోజకవర్గ మండల, పట్టణస్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ లేనిపోని హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. పథకాలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలన్నారు. సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ మనోహర్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్, పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు సాజిద్, ప్రమోద్ రెడ్డి, సతీష్ పవర్, రోకండ్ల రమేశ్, బుట్టి శివకుమార్, సలీం పాషా, దాసరి రమేశ్, స్వరూపరాణి, బుడగం మమత, పర్వీన్‌ఖాను, పర్వీన్ ఫెరోజ్, దివిటి రాజు, కరుణ పాల్గొన్నారు.

పూలాజీబాబా చూపిన సన్మార్గంలో నడవాలి


మాట్లాడుతున్న సునీత వెంకట్

తలమడుగు: సద్గురు పరమహంస శ్రీ పులాజీబాబా చూపిన సన్మార్గంలో నడవాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్ అన్నారు. మండల కేంద్రంలోని పూలాజీబాబా ధ్యాన మందిరంలో మంగళవారం నిర్వహించిన ఆధ్యాత్మిక ఆత్మజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఎంపీడీవో రమాకాంత్, పూలాజీ బాబా ధ్యాన కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్‌రెడ్డి, అధ్యక్షుడు నీలగిరి అశోక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సహకార సంఘం ఉపాధ్యక్షుడు నల్ల పద్మాకర్‌రెడ్డి, కమిటీ ఉపాధ్యక్షుడు పులాజీబాబా ధ్యానమందిర కమిటీ ప్రధాన కార్యదర్శి సునీత రెడ్డి, సభ్యులు ఇందిరమ్మ, రాధాబాయి, మీనాక్షి, భూమయ్య, లక్ష్మి, నారాయణ పోచన్న రాకేశ్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నార్నూర్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అరవింద్ అన్నారు. గాదిగూడ మండలంలోని లోకారి(కే)ఎంపీపీ పాఠశాల ఆవరణలో డీటీఎఫ్ క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్


శ్రీలేఖకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆదివాసీ నాయకురాలు శ్రీలేఖ బీజేపీలో చేరగా, ఆమెకు కండువా కప్పారు. అంతకుముందు ఆమె పట్టణంలోని శివాజీచౌక్, అంబేద్కర్‌చౌక్, నేతాజీచౌక్, వినాయక్ చౌక్‌ల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. తర్వాత కుమురంభీం విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ధర్మరక్షణలో ముందుండాలి


హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న భక్తులు

సిరికొండ: ధర్మరక్షణలో యువత ముందుండాలని శ్రీ సంత్ శ్రీ నారాయణ్ మహరాజ్ కోరారు. సిరికొండలో సనాతన ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సమ్మేళనసభ, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం చేపట్టిన శోభాయాత్రలో భక్తులు పాల్గొన్నారు. శివాలయం ఆవరణలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

ఘనంగా సుభాష్‌చంద్రబోస్ జయంతి


ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ డిగ్రీ సైన్సెస్ కళాశాలలో..


నివాళులర్పిస్తున్న నాయకులు


బేల: నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు


తాంసి: నివాళులర్పిస్తున్న ఎస్సై, ఉపాధ్యాయులు


బోథ్: వివేకానంద పాఠశాలలో..

ఆదిలాబాద్‌టౌన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని జిల్లావ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ సైన్సెస్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమ సమయంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఆజాద్‌హింద్ ఫౌజ్ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ప్రతిఏటా ఆయన జన్మదిన పరాక్రమ దివస్‌గా జరుపుకుంటామన్నారు. అకాడమిక్ కోఆర్డినేటర్ రఘునాథ్, జగ్‌రాం, జంతుశాస్త్ర శాఖ అధిపతి విజయ్‌కుమార్, లెక్చరర్లు, ఎస్ఎస్ఎస్ ఎండీ అశ్రఫ్ అలీ, రమేశ్‌రెడ్డి, తిరుపతి, పీడీ అనిత, జ్యోత్స్న, విద్యార్థులు పాల్గొన్నారు.

- నేతాజీ సుభాష్‌చంద్రబోస్ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఆదిలాబాద్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం ఆయన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చేసిన ఉద్యమాన్ని విద్యార్థులకు వివరించారు. యూఆర్ఎస్ పాఠశాల ప్రత్యేక అధికారి ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు గణేశ్, శకుంతల, ప్రశాంత్ కుమార్, అర్పిత్, రుత్విక, స్వప్న, వీణ పాల్గొన్నారు.
- సుభాష్‌చంద్రబోస్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏబీవీపీ, బీజేపీ నాయకులు అన్నారు. జిల్లాకేంద్రంలోని నేతాజీ చౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి ప్రాథమిక పాఠశాలలో ఎస్సై లాల్‌సింగ్ నాయక్, ఉపాధ్యాయులతో కలిసి నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ కళ్యాణి, పాఠశాల చైర్మన్ మల్లికార్జున్, ఉపాధ్యాయులు శంకర్, జ్యోతి పాల్గొన్నారు.

బేల: మండలకేంద్రంలో శివాజీ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీశ్‌రెడ్డి, సభ్యులు ప్రీతం, నవనీత్, రాపెల్లి కృష్ణ, బర్కాడే రాము, సచిన్, సాయి, యోగేశ్‌రెడ్డి, నితీశ్, అతుల్ తదితరులు ఉన్నారు.

బోథ్: సొనాలలోని వివేకానంద పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. కరస్పాండెంట్ ఓరుగంటి ఇస్తారి, ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధపెట్టాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సర్ఫరాజ్

ఆదిలాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని మండల వైద్యాధికారి డాక్టర్ సర్ఫారాజ్ అన్నారు. మండలంలోని తిప్ప గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ, తిప్ప గ్రామాల్లో మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ప్రధానమంత్రి జన్‌మాన్ కార్యక్రమంలో భాగంగా సికిల్‌సెల్ ఎనిమియా రక్తనిర్ధారణ పరీక్షలు చేశారు. చిన్నారులకు టీకాలు వేశారు. చిరుధాన్యాలపై కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్యసిబ్బంది బొమ్మెత సుభాష్, మడావి సత్యవతి, పవర్ శైలజ, రాథోడ్ నారాయణ, పవర్ ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు..కుర్చీలాట



ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి జిల్లా అధికారులతో ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. అయితే ఏ వరుసలో ఎవరు కూర్చుకోవాలనే దానిపై ప్రత్యేకంగా స్టిక్కర్లు ఏర్పాటు చేశారు. కొందరు అధికారులకు కుర్చీలు సరిపోకపోవడంతో స్వయంగా వారే కుర్చీలు మోస్తూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పీహెచ్‌సీ తనిఖీ


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్

తలమడుగు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం (ట్రెయినీ) శిక్షణ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌కి ఎంత మంది పేషెంట్లు వస్తుంటారు.. అన్ని మందులు అందుబాటులో ఉన్నాయా? ఏమైనా కొరతా ఉందా? అనే వివరాలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓపీ, థియేటర్, మెడిసిన్ రిజిస్టర్లను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైద్యాధికారి హరీశ్, శ్రీకాంత్, సూపర్‌వైజర్లు, నిర్మల, రవిదాస్, సిబ్బంది ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

ఎదులాపురం: జిల్లాకేంద్రంలోని వాణి విద్యామందిర్ పాఠశాలలో 2007–08 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు మహేందర్, అనిత, హన్మంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్, స్వామి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కైలాస్‌నగర్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పలువురు ఎంఐఎం, బీఆర్ఎస్, నాయకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని ప్రజా సేవ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి కండువాలు కప్పారు. అనంతరం ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం టీఎస్ఈఈ యూనియన్ 327, ఐఎన్టీయూసీ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు భగీరథ నీరు కట్

బోథ్: మండల కేంద్రంలోని కంద్రవాగు వంతెన పనులు కారణంగా పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను తొలగిస్తున్నారు. మరపెల్లి చుట్టుపక్క గ్రామాలతోపాటు బోథ్, ధన్నూర్, కుచులాపూర్ గ్రామాలకు బుధ, గురువారాల్లో నీటి సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

కందుల కొనుగోళ్లు ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లో మంగళవారం కందుల కొనుగోళ్లను ఉట్నూర్ ఎఫ్‌పీసీసీఈవో కాంబ్లే ప్రజ్ఞశీల్ ప్రారంభించారు. నాఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభించినట్లు తెలిపారు.

నేడు బేలలో..

బేల: మండలకేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో బుధవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు జైనథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి కాంబ్లే మధుకర్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు నాణ్యమైన కందులను తీసుకువచ్చి మద్దతు ధరపొందాలని సూచించారు.

కొలాంగూడ సందర్శన

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ పంచాయతీ పరిధిలోని కొలాంగూడను ఎంపీడీవో రమేశ్, సీడీపీవో శారద మంగళవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. పౌష్టికాహార లోపం ఉన్న ముగ్గురు చిన్నారులను ఉట్నూర్‌లోని న్యూట్రిషన్ కేంద్రానికి తరలించాలన్నారు. తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, ఎంపీటీసీ రేణుక, దిలీప్ జాదవ్ తదితరులు ఉన్నారు.

28న ముక్తా సాల్వే జయంతి

ఎదులాపురం: ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఈనెల 28న ముక్తా సాల్వే మాంగ్ 183వ జయంతి నిర్వహిస్తున్నట్లు మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు గాదేకర్ పరశురాం మాంగ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్య అతిథులుగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు గైక్వాడ్ తులసిదాస్ మాంగ్, మహారాష్ట్ర ప్రముఖ వక్త తోట్వే బాలాజీ మాంగ్ హాజరవుతారని తెలిపారు. మాంగ్ సమాజ్ పెద్దలు, మేధావులు, విద్యార్థులు తరలిరావాలని కోరారు. సమావేశంలో ఆదిలాబాద్ పట్టణ కమిటీ కార్యదర్శి సూర్యావంశీ సాయి, ఇంద్రవెల్లి మండల ప్రధాన కార్యదర్శి సమూకరావు హరిదాస్, సలహాదారు సమూకారావు దీపక్, ఇచ్చోడ మండల ఉపాధ్యక్షుడు తల్వారే విట్టల్, కమిటీ సభ్యులు కాంబ్లే సాయి, గైక్వాడ్ దినేశ్, కాంబ్లే సాయిరాం పాల్గొన్నారు.